రాకపోకలు భయం.. భయంగా..

- మునగపాకలో బీటలు వారిన బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి
- కూలిన రక్షణ గోడలు, దెబ్బతిన్న వంతెన అడుగు భాగం
- భయాందోళన మధ్య వాహనచోదకుల రాకపోకలు



మునగపాకలో దెబ్బతిన్న బ్రిడ్జి రక్షణ గోడలు



దెబ్బతిన్న బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి అడుగు భాగం

మునగపాక: ఏళ్ల కాలం నాటి బ్రిడ్జి ప్రస్తుతం బీటలు వారింది. కూలిన రక్షణ గోడలు.. దెబ్బతిన్న వంతెన అడుగుభాగం కారణంగా రాకపోకలకు వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా ఈ వంతెన పునర్నిర్మాణం చేపడతారని అంతా ఆశించారు. అయితే విస్తరణ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఈ వంతెనకు ఇప్పట్లో మోక్షం కలిగేలా కనిపించడం లేదు.

రోడ్డు విస్తరణతోనే సమస్య పరిష్కారం

పూడిమడక రోడ్డు విస్తరణతోనే ఈ వంతెనకు మోక్షం కలగనుంది. ఇప్పటికే ప్రభుత్వానికి అధికారులు ఈ విషయమై ప్రతిపాదనలు సైతం పంపించారు. ప్రస్తుతం ఉన్న శిథిల బ్రిడ్జిని తొలగించి పక్కగా కొత్త వంతెన నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే విస్తరణ ప్రక్రియపైనే కొత్త బ్రిడ్జి నిర్మాణం ఆధారపడి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రహదారి విస్తరణకు అవసరమైన నిధులు అందుబాటులో లేవని తెలిసింది. దీంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. శిథిల వంతెన విషయంలో అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోకుంటే ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయోనన్న ఆందోళన వాహనచోదకుల్లో ఉంది.

భారీ వాహనాలతో ముప్పు



శిథిల బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

మునగపాక కృష్ణంరాజు కాలువపై బ్రిటిష్ వారు ఈ వంతెన నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. బ్రిడ్జి అడుగు భాగం బాగా పాడైంది. దీనికి తోడు బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు సైతం దెబ్బతిన్నాయి. అచ్యుతాపురంలోని బ్రాండిక్స్‌కు వేలాది మంది ఉద్యోగులు బస్సుల్లో ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. రాంబిల్లి మండల పరిధిలో తలపెట్టిన నేవీ ప్రాజెక్ట్ నిర్మాణానికి అధిక లోడుతో లారీలు రేయనక, పగలనక నిత్యం ఈ వంతెన పైనుంచి తిరుగుతూ ఉంటున్నాయి. దీంతో ఈ వంతెనకు ముప్పు పొంచి ఉంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు.

త్వరగా మేల్కోవడం మేలు



పూడిమడక రోడ్డులో ప్రయాణం అంటేనే భయంగా ఉంటుంది. మునగపాక కృష్ణంరాజు కాలువపై నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థలో కనిపిస్తుంది. ఎపుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియదు. ఈ బ్రిడ్జి కారణంగా ప్రమాదాలు జరగకముందే అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలి.

– రాజాన బుజ్జిబాబు, అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్

వంతెనకు మోక్షమెప్పుడో?



శిథిలమైన బ్రిటిష్ కాలం నాటి వంతెనకు మోక్షం కలగడం లేదు. ఒకవైపు బ్రిడ్జి శిథిలావస్థలో ఉన్నా భారీ వాహనాల రాకపోకలు తగ్గడం లేదు. ఇలాంటి సందర్భాల్లో బ్రిడ్జి బాగా దెబ్బతింటుంది. దీనికి తోడు బ్రిడ్జి రక్షణ గోడలు సైతం దెబ్బతిన్నాయి. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలి.

– టెక్కలి జగ్గారావు, ఆటో డ్రైవర్

ప్రభుత్వానికి నివేదిక పంపాం..

మునగపాకలోని బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి శిథిలావస్థకు గురైన విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. పూడిమడక రోడ్డు విస్తరణ జరిగితే ఈ వంతెనకు మోక్షం కలుగుతుంది. బ్రిడ్జికి సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– పద్మిని, ఆర్అండ్‌బీ జేఈ

క్లుప్తంగా

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న గిజా పిరమిడ్ వ్యవస్థాపకురాలు లీలా ప్రసన్నకుమారి

మునగపాక: ప్రతి ఒక్కరూ ధ్యానంపై దృష్టి సారించాలని, అప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీగిజా పిరమిడ్ వ్యవస్థాపకురాలు సరిసా లీలా ప్రసన్నకుమారి అన్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శ్రీగిజా పిరమిడ్ ఆధ్వర్యంలో ధ్యానంపై రెండు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సును మంగళవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మొదటి రోజున జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా రోజంతా ఉత్సాహంగా ఆరోగ్యంగానూ ఉండవచ్చన్నారు. ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. అంతేకాకుండా మనస్సు నిర్మలంగా ఉంటుందన్నారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న అభయాంజనేయ స్వామి

ఎస్.రాయవరం: కొరుప్రోలు కుమ్మరాబయిల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి స్వామికి కుంకుమ పూజలు, తమలపాకులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం హనుమాన్ చాలీసా నిర్వహించారు. గాజువాక కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కె.వెంకటాపురంలో డ్రైనేజీలో పూడిక తీస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లోని చెత్తను తొలగించి డ్రైనేజీలలో పూడిక తీశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ పరిశుభ్రతతోనే ఆరోగ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ గ్రామం కోసం అందరూ చేయి కలపాలన్నారు.


ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: మండలంలో ఉపమాకలో దుర్గాదేవి ఆలయ పదో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ ఆలయాన్ని హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ బి.పార్థసారథిరెడ్డి సాయంతో నిర్మించారు. పదో వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి అర్చకుడు వెలవలపల్లి మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన పూజలు, అన్న సమారాధనలో ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంతూర్ స్కాలర్‌షిప్‌నకు నక్కపల్లి విద్యార్థులు



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులు

నక్కపల్లి: సంతూర్ వుమెన్ స్కాలర్‌షిప్‌నకు స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ప్రోగ్రాంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.24 వేలు చొప్పున వారి ఖాతాలో స్కాలర్‌షిప్ జమైందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇది ఒక వరం లాంటిదన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్ రావడం కోసం కృషి చేసిన వెంకటేశ్వరరావు, గణేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

నియోజకవర్గంలో 100 సీసీ కెమెరాల ఏర్పాటు



పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఐ అప్పన్న

పాయకరావుపేట: నియోజకవర్గంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. ఈ మేరకు పట్టణంలో తాండవ జంక్షన్, బైపాస్ సెంటర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, తదితర ప్రాంతాలను సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పాయకరావుపేట మండలంలో పలు చోట్ల 30 కెమెరాలు అందుబాటులో ఉంచుతామన్నారు.

ఘనంగా జాజులమ్మ తల్లి పండగ

మునగపాక: మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో మంగళవారం జాజులమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకున్నారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'కు మద్దతుగా ప్రచారం



యలమంచిలిలో ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం యలమంచిలి పట్టణంలోని పాఠశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో గాదెకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొణతాల విశ్వేశ్వరరావు, ఉమ్మడి విశాఖ జిల్లా పూర్వపు అధ్యక్షుడు బుద్ధ విశ్వేశ్వరరావు, సంఘం సీనియర్ నాయకుడు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాసా సహకారంతో బోర్లు ఏర్పాటు



నాసా సంస్థ ప్రతినిధులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వెంకటలక్ష్మి

కోటవురట్ల: నాసా స్వచ్ఛంద సంస్థ ప్రజా అవసరాలను గుర్తించి సేవా కార్యకలాపాలు నిర్వహించడం అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి అన్నారు. మండలంలో కోటవురట్ల బీసీ కాలనీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నాసా స్వచ్ఛంధ సంస్థ సహకారంతో చేతిబోర్లు ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్యను గుర్తించి బోర్లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని వెంకటలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా వెల్స్ ఫర్ లైఫ్ డైరెక్టర్ వైజర్, న్యూ లైఫ్ డైరెక్టర్ రాజా కులపతిని శాలువాతో సత్కరించారు. ఉప సర్పంచ్ గవ్వా రాధాకృష్ణ, నాసా సంస్థ మండల ఇన్‌చార్జ్ వెంకటరత్నం, సభ్యులు పి.గోవిందు, ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన మత్స్యకార సంఘం కార్యవర్గం

పాయకరావుపేట: మండలంలోని అంకంపేటలో మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.నాగమణి తెలిపారు. సంఘంలో 43 మంది సభ్యులకు 30 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడిగా పిట్ల అప్పారావు, ఉపాధ్యక్షుడిగా దడాల మురళీకృష్ణ, డైరెక్టర్లుగా ఐదుగురు ఎన్నికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సహాయకులుగా వీఎఫ్ఏ జె.పూర్ణిమ, పీఎస్‌వై లహరి పాల్గొన్నారు.

నునపర్తిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

అచ్యుతాపురం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ నునపర్తి గ్రామంలో కూటమి నాయకులు యథేచ్ఛగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసినంత వరకూ రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు పెట్టకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు ఉన్నాయి. అయితే నునపర్తి గ్రామంలో మంగళవారం జరిగిన పండగలో భాగంగా కూటమి నాయకుల ఫ్లెక్సీలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మునగపాక: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌తో కలిసి ఆయన దగ్గరుండి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గిట్టుబాటు ధరల చట్టం చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

అనకాపల్లి టౌన్: రైతులు పండించే వివిధ పంటలకు గిట్టుబాటు ధరల చట్టం పార్లమెంట్‌లో చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం అచ్యుతాపురం మండలం నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈ నెల 14న ఢిల్లీలో దల్లే వాల్ కమిటీతో రైతు సంఘాలతో జరిగే చర్చలు జయప్రదం కావాలని, వివిధ రకాల 23 పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని, తదితర డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బందికి ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కె. రామ సదాశివరావు, నాగేశ్వరరావు, కొండకర్ల పాల సంఘం అధ్యక్షుడు నూకరాజు, ప్రకాష్, బుద్ద రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : డాక్టర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చనని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతి చదువుతున్న వారు 5వ తరగతిలో ప్రవేశానికి, పదో తరగతి చదువుతున్న వారు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులు అని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నా 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



గణపర్తిలో క్యాన్సర్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

మునగపాక: ప్రతి ఒక్కరికీ క్యాన్సర్‌పై అవగాహన అవసరమని వెలుగు ఏపీఎం బాలరాజు అన్నారు. మండలంలోని గణపర్తిలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించడం ద్వారా మరణాలను తగ్గించవచ్చన్నారు. ప్రజలు కూడా క్యాన్సర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదిస్తూ క్యాన్సర్ దరి చేరకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. సీసీ నిర్మల, రామకృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, మోసయ్యపేట బర్మాకాలనీ, వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం గ్రామాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

మండల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక



పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యులు

పాయకరావుపేట: మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక మంగళవారం జరిగింది. కమిటీ చైర్మన్‌లుగా ఓబద్య, డేవిడ్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.జార్జి, ప్రెసిడెంట్‌గా పి.సామ్యూల్, కార్యదర్శిగా జాన్ కాల్విన్, ట్రెజరర్‌గా డి.సువార్తరాజు, ఉపాధ్యక్షుడిగా అనిల్ కుమార్, కమ్యూనికేషన్ కార్యదర్శులుగా విల్సన్, బి.సత్యనారాయణ, జాయింట్ ట్రెజరర్‌గా జి.జోష, సభ్యులుగా పి.ఇస్సాకు, జి.రత్నం మోజస్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో ఏడుగురు పాస్టర్లు సహాయదారులుగా నియామకమయ్యారు.

ప్రత్యేక గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలిస్తున్న ఏవో ఉమా ప్రసాద్

నక్కపల్లి: ప్రభుత్వం రైతులకు మంజూరు చేసే వివిధ పథకాల వర్తించాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. మంగళవారం రమణయ్యపేటలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధార్ తరహా ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్టు చెప్పారు. దీని కోసం ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్, రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు కావాలన్నా ఈ తరహా గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. మండలంలో 12,750 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు పీఎం కిసాన్ పథకం కింద 18 విడతలుగా ఆర్థిక సాయం అందిందన్నారు. 19వ విడత ఆర్థిక సాయం అందాలంటే ఈ గుర్తింపు కార్డులు ఉండాలన్నారు.

రైతులకు భూ ఆధార్ నమోదు తప్పనిసరి

మునగపాక: ప్రతి రైతు తప్పనిసరిగా భూ ఆధార్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పథకాల లబ్ది కోసం భూ ఆధార్ లేదా ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో కార్యక్రమం అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. భూ ఆధార్‌లో పేరు నమోదు చేసుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ అందుతుందన్నారు. భూమున్న ప్రతి రైతు సమీపంలోని సచివాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 25లోగా రైతులు పట్టాదారు పుస్తకం గాని వన్‌బీ అలాగే ఆధార్ కార్డు, ఆధార్ కార్డుతో లింక్ ఉన్న ఫోన్ నంబరును తీసుకువెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటల నమోదు సత్వరమే పూర్తి చేయండి



క్షేత్ర స్థాయిలో మినుము పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమం సిబ్బంది సత్వరమే పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పి.ఆదినారాయణ సూచించారు. మంగవరం, గోపాలపట్నం గ్రామాల్లో మంగవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి, పంటల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలను నమోదు చేయాలని, రైతులతో ఈకేవైసీ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రైతులు పండించే మినుము, పెసర, అపరాల పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఆర్.సాధన, ఎంపీఈవో సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెం తీరంలో వ్యర్థాల తొలగింపు



వాడపాలెం తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న యువకులు

రాంబిల్లి(యలమంచిలి): ప్లాస్టిక్ వ్యర్థాలతో వాడపాలెం తీరాన్ని కలుషితం చేయవద్దని మాఘ పౌర్ణమికి వచ్చే భక్తులను వాడపాలెంయువకులు కోరారు. మంగళవారం గ్రామానికి చెందిన యువకులు అందరూ నడుంకట్టి తీరంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సంచులలో వేసి తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ మాఘ పౌర్ణమి జాతరకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశించిన ప్రదేశంలోనే వేయాలని సూచించారు. తీరంలో శివపార్వతుల విగ్రహాలు, గంగమ్మతల్లి ఆలయం, తీరంలో చెత్తతో పాటు పగిలిన గాజు సీసాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు జగదీష్, సోమేష్, వెంకటేష్, శివ, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి



స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ కిట్స్‌తో విద్యార్థులు

ఎస్.రాయవరం: దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం అగ్రహారం ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న సుమారు 80 బాలికలకు నాందీ ఫౌండేషన్ సభ్యులు స్పోర్ట్స్ మెటీరియల్, ఎడ్యుకేషన్ కిట్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాందీ ఫౌండేషన్ సభ్యులు టి.అనిత, ఉపాధ్యాయులు లలితాంబ, కుసుమ కుమారి, గారా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.